## క్లుప్తంగా

### బీఆర్‌ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

**భీమిని:** కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామానికి చెందిన పలువురు సోమవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కండువా కప్పి ఆహ్వానించారు. జన్కాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఇప్ప బాపు ఆధ్వర్యంలో పలువురు వార్డు సభ్యులతో పాటు మహిళలు, యువకులు భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొటారపు సత్యనారాయణ, రైతు సమన్వయ కమిటీ మండల కన్వీనర్ శ్రీరామరావు, సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు కర్రె శంకర్, సురేష్, అల్లి ప్రశాంత్, శంకర్, ఉదయ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### నిషేధాజ్ఞలు కొనసాగింపు

**పాతమంచిర్యాల:** సాధారణ పౌరులు, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమలులో ఉన్న నిషేధాజ్ఞలు పొడిగిస్తున్నామని రామగుండం పోలీస్‌కమిషనర్ రెమా రాజేశ్వరీ ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తు ఆగడాలకు పాల్పడుతున్న వారిపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నిషేధాజ్ఞలు ఈ నెల 01నుంచి అక్టోబర్ 01వరకు కొనసాగుతాయన్నారు. పరిస్థితుల ప్రభావంతో నిషేధాజ్ఞల కాలపరి మితి పొడిగించే అవకాశముందన్నారు. ఐపీసీ 188 ప్రకారం నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతిలేని డ్రోన్‌లు, డీజేలపై కూడా నిషేధం అక్టోబర్ నెల వరకు అమలులో ఉంటుందన్నారు.

### 9న జాతీయ లోక్ అదాలత్

**బెల్లంపల్లి:** ఈ నెల 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య తెలిపారు. బెల్లంపల్లి పోలీసు డివిజన్ పరిధి మంచిర్యాల, బెల్లంపల్లి న్యాయస్థానాల్లో రాజీ పడదగిన కేసులను కక్షిదారులు రాజీ చేసుకోవాలని తెలిపారు. భూ తగాదా, చిట్ ఫండ్, రోడ్డు ప్రమాదాలు, ఎక్సైజ్, వివాహ, కుటుంబ తగాదాలు, ట్రాఫిక్ ఈ చలాన్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకోవాలని సూచించారు. కక్షిదారులు సానుకూలంగా స్పందించి, కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏసీపీ విజ్ఞప్తి చేశారు.

### ఉత్తమ ప్రిన్సిపాల్‌గా శ్రీకాంత్‌రెడ్డి



**జన్నారం:** సరికొత్త విధానాలతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలుగు తీస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంలో సరికొత్త విధానాలను అవలంభిస్తున్న జన్నారం మండలకేంద్రంలోని స్లేట్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి శ్రీనివాస రామానుజం ఫౌండేషన్ అందించే బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డుకు ఎంపికైనట్లు శ్రీనివాస రామానుజం ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ అమరేశ్ తెలిపారు. విద్యనందించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేయడం, కరోనా సమయంలో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించి, విద్యార్థులు విద్యకు దూరం కాకుండా సేవలందించినందుకు గాను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

### భూమాచారి దీక్షకు బీసీ సంఘాల మద్దతు



దీక్షలో కూర్చొని మద్దతు తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

**జన్నారం:** మండలానికి 132కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సామాజిక కార్యకర్త భూమాచారి చేపట్టిన నిరవధిక దీక్షకు సోమవారం బీసీ కుల పోరాట సమితి మద్దతు పలికి దీక్షలో పాల్గొన్నారు. ఆదివారం భారీ వర్షంలో ఒక్కడే దీక్షలో కూర్చోవడం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, దీక్షకు మద్దతు పెరిగింది. బీసీ కుల పోరాట సమితి నాయకులతో పాటు పలువురు స్వచ్ఛంద సంస్థ నాయకులు మద్దతు తెలిపారు. దీక్ష శిబిరం వద్దకు విద్యుత్ ఏఈ లచ్చయ్య వచ్చి ఉన్నతాధికారులతో మాట్లాడించారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుకు భూమి కేటాయించకపోవడం వల్లే నిర్మాణం ఆగిందని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొడూరి చంద్రయ్య, కో కన్వీనర్లు నర్సింహులు, భాస్కర్‌గౌడ్, నర్సయ్య, విజయ్, రాజన్న, బీజేవైఎం అధ్యక్షుడు ప్రవీణ్, బీఆర్‌ఎస్ నాయకుడు సృజన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- కలెక్టర్ బదావత్ సంతోష్
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ
- గైర్హాజరు అయిన వారికి షోకాజ్ నోటీసులు?



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

**నస్పూర్:** ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీఓలు రాములు, సురేశ్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జాప్యం జరిగితే అందుకు కారణం దరకాస్తుదారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రజావాణిలో 75 దరఖాస్తులు వచ్చాయని ప్రతీ దరఖాస్తును పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 3,311 దరఖాస్తులు వచ్చాయని, 3,062 పరిష్కరించామని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. గైర్హాజరు అయిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

- మంచిర్యాల పట్టణానికి చెందిన సీహెచ్ రమేశ్ అనే కాంట్రాక్టర్ తాను 2019లో గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన బిల్లులు ఇంతవరకు చెల్లించలేదని, త్వరగా మంజూరు చేయించాలని అర్జీ అందించాడు.
- దండేపల్లి మండలం రెబ్బనపల్లి గ్రామానికి చెందిన కుర్రె రాజవ్వ తన భర్త పాము కాటుతో మృతి చెందాడని తనకు పెన్షన్ ఇప్పించాలని దరఖాస్తు సమర్పించింది.
- తన కూతురు స్నేహారిక(10) మానసిక వికలాంగురాలని, దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని భీమినికి చెందిన రేవతి అర్జీ పెట్టుకుంది.
- వేమనపల్లి మండలం రాజారాం గ్రామానికి చెందిన పలువురు తాము 15 ఏళ్లుగా భూమిని సాగుచేసుకుంటున్నం. ఇటీవల అధికారులు సర్వే చేశారని, కానీ హక్కు పత్రాలు ఇవ్వలేదని తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు తమ పత్తి పంటను నాశనం చేశారని పేర్కొన్నారు. తమకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు.

**ప్రజావాణికి స్పందన కరువు**

**భీమారం:** ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో విద్యుత్ సమస్యపై ఒక దరఖాస్తు వచ్చింది. ప్రజలు సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగకుండా ప్రజావాణికి రావాలని కోరారు. ఇందులో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**చెన్నూర్‌రూరల్:** మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించగా స్పందన కరువయ్యింది. ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. ఈ ప్రజావాణిలో ఈజీఎస్ ఏపీవో గంగాభవాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, ఎంబీ ఏఈఈ సరిత, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోడు భూముల సర్వే చేపట్టాలి

- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించి గిరిజనుల ఆందోళన



నినాదాలు చేస్తున్న గిరిజనులు

**నెన్నెల:** పోడు భూముల సర్వే చేపట్టి పట్టాలు అందజేయాలని కోరుతూ నెన్నెల, వేమనపల్లి మండలాలకు చెందిన 60మంది ఆదివాసీ గిరిజన మహిళలు సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఎంపీడీఓ వరలక్ష్మి వచ్చి సర్వేకు హామీ ఇచ్చే వరకు కదిలేది లేదని కార్యాలయం ముఖద్వారం ఎదుట 5గంటల పాటు బైఠాయించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి ఎరుగటి లక్ష్మి మాట్లాడుతూ.. ఉట్నూర్ ఐటీడీఏ పీఓ, ఎంపీడీఓలకు సర్వే చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పోడుదారులకు సమాచారం ఇచ్చి క్షేత్రస్థాయిలో వెంటనే సర్వే చేపట్టి, గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అమాయక గిరిజన మహిళలను కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిప్పించుకుంటూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రేపు, మాపు మీటింగ్‌లు అంటూ ఎంపీడీఓ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 5గంటల పాటు కార్యాలయంలో ఉన్న అధికారులను బయటకు రాకుండా బయట నుంచి వచ్చే అధికారులను లోనికి వెళ్లకుండా ముఖద్వారానికి అడ్డంగా బీక్షించు కూర్చొని నిరసన తెలిపారు. ఎంపీడీఓ వరలక్ష్మి కలెక్టరేట్‌లో సమావేశానికి వెళ్లిందని కార్యాలయంలో ఉన్న అధికారులు సముదాయించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న బెల్లంపల్లిరూరల్ సీఐ రాజ్‌కుమార్, నెన్నెల ఎస్సై శ్యాంపటేల్ అక్కడికి చేరుకొని గిరిజన మహిళలను సముదాయించారు. సీఐ ఎంపీడీఓతో ఫోన్‌లో మాట్లాడగా మంగళవారం ఉదయం ఎంపీడీఓ కార్యాలయానికి గిరిజనులను రమ్మని చెప్పారు. ఆందోళన చేస్తున్న గిరిజనులకు సర్వే చేపడుతామని ఫోన్‌లో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కోణంపేట, పాటి, కుశ్నపల్లి, చిత్తాపూర్, బుయ్యారం, జిల్లెడ గ్రామాల గిరిజన మహిళలు పాల్గొన్నారు.

## బొగ్గుబాయి వార్తలు

### ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

**నస్పూర్:** శ్రీరాంపూర్ ఏరియాలోని భూగర్భ ఉపరితల గనులకు నిర్దేశించిన నెలవారి బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఆయన ఆగస్టు నెల బొగ్గు ఉత్పత్తి రవాణా, నిర్దేశిత లక్ష్యాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రఘుకుమార్, ఇందారం ఓసీపీ పీఓ శ్రీనివాస్, అధికారులు మురళీధర్, ఏవీరెడ్డి, గోపాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### ఏరియర్స్ ఒకే దఫాలో చెల్లించాలి



మాట్లాడుతున్న వీరభద్రయ్య

**నస్పూర్:** సింగరేణి కార్మికులకు చెల్లించాల్సిన 11వ వేజ్‌బోర్డుకు సంబంధించిన 23నెలల ఏరియర్స్‌ని కోల్ ఇండియా మాదిరిగా ఒకే దఫాలో చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య తెలిపారు. ఆర్కే 7 గనిపై సోమవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణి సంస్థ ఏరియర్స్ చెల్లింపులో కాలయాపన చేస్తూ కార్మికులను అసంతృప్తికి గురి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థను ఆర్థిక దోపిడీకి గురిచేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కొట్టి కిషన్‌రావు, నాయకులు పెళ్లి రాజేందర్, సామిని సదానందం, పరిగెల ప్రతాప్, అనిల్, వేముల తిరుపతి, చిలుక రాంచందర్, మధూకర్ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణకారులకు ప్రభుత్వం చేయూతనందించాలి



జిల్లా కేంద్రంలో నిరసన దీక్షలో స్వర్ణకారులు



చెన్నూర్‌లో ర్యాలీ తీస్తున్న స్వర్ణకారులు

**పాతమంచిర్యాల:** స్వర్ణకారులకు ప్రభుత్వం చేయూతనందించి చేతివృత్తిపై ఆధారపడి జీవిస్తున్న స్వర్ణకారుల కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు ధర్మవరం బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శి మునుగంటి హన్మయ్యచారి అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఒక్కరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించిన విశ్వబ్రాహ్మణ స్వర్ణకారులకు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత అన్యాయం జరుగుతుందన్నారు. స్వర్ణకారుల మనుగడను దెబ్బతీసేలా కార్పొరేట్, జ్యుయెల్లరీ షాపులు విరివిగా ఏర్పడుతున్నాయని, దీంతో స్వర్ణకారులకు ఉపాధిలేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం చేతి వృత్తిదారుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. తమిళనాడు రాష్ట్రంలో మాదిరిగా తెలంగాణలో స్వర్ణకార వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. జీవో 272ను పటిష్టంగా అమలు చేసి, అందులోని లోపాలను సవరించి స్వర్ణకారులపై జరుగుతున్న పోలీస్ వేధింపులను అరికట్టాలన్నారు. పుస్తెలు, మట్టెలు, ఉంగరాలు, లక్ష్మీరూపులు స్వర్ణకారులే తయారు చేసేలా జీవో తీసుకురావాలన్నారు. కులవృత్తి చేసుకుంటూ అకాలమృత్యువు పాలైన స్వర్ణకారుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్రోజు వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు గుండోజు రమేష్, పట్టణ అధ్యక్షుడు సంజీవ్, కోశాధికారి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

**స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలి**

**చెన్నూర్:** స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలో స్వర్ణకారుల సంఘం ప్రధాన కార్యదర్శి చిలుకూరి సందీప్ ఆధ్వర్యంలో రాజీవ్ రోడ్డు నుంచి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్ గోవింద్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం నాయకులు ఏలేశ్వరం రమేశ్, పట్టణంలోని స్వర్ణకారులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ టీచర్ల సమ్మె బాట

- సమస్యలు పరిష్కరించాలని 11 నుంచి నిరవధిక సమ్మె



లక్సెట్టిపేటలో సీడీపీవోకు సమ్మె నోటీసు అందజేస్తూ..

**నెన్నెల:** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నట్లు నెన్నెల మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, సబిత, విజయలక్ష్మి, సువర్ణ, చంద్రకళ, సరళాదేవి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

**లక్సెట్టిపేట:** అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సీడీపీవోకు నోటీసు అందజేశారు. ఈ నెల 11నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో పాల్గొంటున్నారని, వారి సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. సంబంధిత అధికారులు పట్టించుకొని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రంజిత్, అంగన్‌వాడీ కార్యకర్తలు స్వరూప, సరస్వతి, లక్ష్మి, నసీం బేగం పాల్గొన్నారు.

**జన్నారం:** సంవత్సరాల కాలంగా పని చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు సమ్మెబాట పట్టనున్నారు. ఇందులో భాగంగా సోమవారం తహసీల్దార్ వనజారెడ్డికి అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ సమ్మె నోటీస్ అందజేశారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ, నిరవధిక సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

**తాండూర్:** సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తాండూర్ మండలంలో అంగన్‌వాడీ టీచర్లు ధర్నా చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సామూహికంగా తరలివచ్చిన అంగన్‌వాడీలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, నాయకులు రాజేశం, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

### భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న బాల్క సుమన్

**మందమర్రిరూరల్:** పట్టణంలోని రెండో జోన్ 11వ వార్డులోని పోచమ్మ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేతతో కలిసి సోమవారం భూమిపూజ చేశారు. పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి కోల్‌బెల్ట్ రహదారి మీదుగా బీఆర్‌ఎస్, అనుబంధ సంఘాల నాయకులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

### వంటావార్పుతో నిరసన



ఉద్యోగులకు మద్దతు ప్రకటిస్తున్న సురేఖ

**పాతమంచిర్యాల:** తమ ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలనే డిమాండ్‌తో జిల్లా కేంద్రంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్ష ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఉద్యోగులు దీక్ష శిబిరం వద్ద వంటావార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ సందర్శించి, వారి దీక్షకు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు బాపుయాదవ్, సుమలత, నగ్మ, రజని, శివ, అశోక్, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, సరిత, భారతి, కిరణ్, పీహెచ్‌సీల స్టాఫ్‌నర్సులు, ల్యాబ్‌టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

### 'ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'

**చెన్నూర్‌రూరల్:** మండలంలోని బావురావుపేట గ్రామ సమీపంలో సర్వే నంబర్ 8లో అయిదు నెలల క్రితం పేదలు వేసుకున్న గుడిసెలను ట్రాక్టర్లతో కూల్చి, పెట్రోల్ పోసి దగ్ధం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. దగ్ధమైన గుడిసెలను సోమవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇళ్లు లేని నిరుపేదలు ప్రభుత్వ అసైన్డ్ భూమిలో గుడిసెలు వేసుకుంటే, ఇలా చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొడెంకి చందు, చెన్నూర్ పట్టణ కన్వీనర్ ఎండీ అవేజ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆలయంలో ప్రత్యేక పూజలు



మోహన్‌జోషిని సన్మానిస్తున్న చంద్రశేఖర్, పద్మ

**మంచిర్యాల అర్బన్:** మహారాష్ట్రకు చెందిన కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్సీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు మోహన్‌జోషి సోమవారం స్థానిక పంచముఖి హనుమాన్ దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీపీసీసీ సభ్యుడు కొండ చంద్రశేఖర్, వార్డు కౌన్సిలర్ పద్మలు సన్మానించారు.

# వైరల్‌గా మున్సిపల్ చైర్‌పర్సన్ వ్యాఖ్యలు

- అధికార పార్టీలో దుమారం

**రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ ఇటీవల చేసిన కామెంట్స్ హాట్ టాపిక్‌గా మారాయి. చెన్నూర్ ఎమ్మెల్యే బాల్కసుమన్‌పై ఆమె చేసిన అనుచిత వ్యాఖ్యలు బీఆర్‌ఎస్‌లో దుమారం రేపుతున్నాయి. రామకృష్ణాపూర్‌లోని బీజోన్ ఏరియాకు చెందిన ఓ వ్యక్తి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై వారంరోజుల క్రితం ఓ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు పెట్టాడు. చైర్‌పర్సన్ కాలువను ఆక్రమించి తన ఇంటి నిర్మాణం చేపడుతుందనేది ఆ మెసేజ్ సారాంశం. గ్రూప్‌లో మెసేజ్ విషయం ఆలస్యంగా తెలుసుకున్న చైర్‌పర్సన్ జంగం కళ ఎందుకు తప్పుడు మెసేజ్‌లు పెడుతున్నావంటూ ఆదివారం సాయంత్రం సదరు వ్యక్తిని ప్రశ్నించింది. దీంతో ఆ వ్యక్తితోపాటు అతని కుటుంబసభ్యులు జంగం కళతో వాగ్వాదానికి దిగారు. గతంలో ఓ బోరు విషయంలో వీరి మధ్య తలెత్తిన వివాదాన్ని కూడా ప్రస్తావించడంతో వీరి మధ్య మాటామాట పెరిగింది. ఇదే సమయంలో మీరిలా చేస్తూపోతే ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌కు ఫిర్యాదు చేస్తామని ఆ వ్యక్తి అనటంతో కోపోద్రిక్తురాలైన మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ 'రాయకూడని భాష'లో నోరుపారేసుకున్నారు. చైర్‌పర్సన్ హోదాలో ఉండి.. దుర్భాషలాడిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది. కాగా, తనపై సోషల్‌మీడియాలో తప్పుడు పోష్టులు చేస్తున్నాడంటూ జంగం కళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

### సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసనబాట

**మంచిర్యాలఅర్బన్:** తెలంగాణ సమగ్రశిక్షలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు నేటి నుంచి నిరసన బాట పట్టారు. ఈ నెల 11వరకు నిరవధిక నిరసనలో భాగంగా ఒక్కోరోజు వినూత్న పద్ధతిలో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు. జిల్లాలో 597మంది సమగ్రశిక్షలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మంచిర్యాల డీఈవో కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఏడు రోజుల పాటు నిర్వహించే నిరసన కార్యక్రమ వివరాలను సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘాల జిల్లా జేఏసీ అధ్యక్షురాలు భారతీదేవి, ప్రధాన కార్యదర్శి రాజన్న, కోశాధికారి నగేష్‌లు వెల్లడించారు.

# నేడు కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటిస్తున్న నాయకులు

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** మంచిర్యాల, హాజీపూర్ మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు సోమవారం పార్టీ సీనియర్ నాయకుడు, న్యాయవాది సిరిపురం రాజేశ్ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తమ నిర్ణయం ప్రకటించారు. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, ఆయన కుమారుడు విజిత్‌కుమార్ ఒంటెత్తు పోకడలు, అనాలోచిత, అభివృద్ధి నిరోధక నిర్ణయాలు, అప్రజాస్వామిక పాలన, ఉద్యమకారులను అణిచివేయడంతో బీఆర్‌ఎస్ పార్టీ వీడుతున్నట్లు ప్రకటించారు. తమ రాజీనామా పత్రాన్ని బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ నెల 5న మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ నాయకత్వంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వివరించారు. హాజీపూర్ జెడ్పీటీసీ పూస్కూరు శిల్ప, రైతుబంధు సమితి మండల కన్వీనర్ పూస్కూరు శ్రీనివాసరావు, ఉప సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరపు జితేందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ రాచకొండ ఆశాలత, మాజీ ఎంపీటీసీ శైలజ, మాజీ సర్పంచ్ గోనె సంజయ్, బీఆర్‌ఎస్ హాజీపూర్ మండల మాజీ అధ్యక్షుడు దొమ్మటి సత్తయ్య, జిల్లా, మండల సీనియర్ నాయకులు కాంగ్రెస్‌లో చేరనున్నారు.

## సంక్షిప్త వార్తలు

**అక్రమ నిర్మాణాలు చేస్తే చర్యలు**

**లక్సెట్టిపేట:** మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ తెలిపారు. 375సర్వే నంబర్‌లో కొంత మంది వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చిందని, అలాంటివి చేసినట్లయితే నిర్మాణాలు నిలిపేసి కూలగొట్టనున్నట్లు హెచ్చరించారు.

**ఘనంగా విగ్రహ ప్రతిష్టాపనలు**

**రామకృష్ణాపూర్:** స్థానిక ఆర్కే1 మార్కెట్ ఏరియాలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో నవగ్రహ, సుబ్రహ్మణ్యేశ్వర, శివలింగం విగ్రహాలను ప్రతిష్ఠించారు. హోమం, యంత్రపూజలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

**నిధులు కేటాయించాలని వినతి**

**మంచిర్యాలటౌన్:** సీఎం కేసీఆర్ మున్సిపాలిటీకి మంజూరు చేసిన రూ.25కోట్ల నుంచి 23, 24వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఆ వార్డు కౌన్సిలర్లు సంజీవ్, బానేష్‌లు మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్యకు వినతిపత్రం అందజేశారు. గతంలో డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా మంచిర్యాల మున్సిపాలిటీలో వివిధ వార్డుల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టగా, అందులో నుంచి 23, 24వార్డులకు నిధులు కేటాయించలేదని, సీఎం నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

**క్రీడా పాఠశాలకు ఎంపిక**

**జన్నారం:** మారుమూల గ్రామానికి చెందిన గిరిజన బాలిక క్రీడా పాఠశాలకు ఎంపికైంది. మండలంలోని దొంగపల్లి ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న రోజారాణి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం వామన్‌కుమార్ తెలిపారు. ఈ విద్యార్థిని ఆదిలాబాద్‌లోని క్రీడా పాఠశాలలో సీటు సాధించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థిని క్రీడా పాఠశాలలో సీటు సాధించడంపై ఎంఈవో విజయ్‌కుమార్, కాంప్లెక్స్ హెచ్ఎం జనార్దన్ అభినందించారు.

**స్ట్రెచర్ ట్రాలీలు అందజేత**

**మంచిర్యాలటౌన్:** సివిల్ ఆసుపత్రికి లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎ.బాలాజీ ఆధ్వర్యంలో సోమవారం రోగులకు ఉపయోగపడేలా నాలుగు స్ట్రెచర్ ట్రాలీలను అందజేశారు.

**నూతన కమిటీ ఎన్నిక**

**చెన్నూర్:** పట్టణ మహేశ్వరి సమాజ్ కమిటీ ఎన్నికలను సోమవారం మాజీ అధ్యక్షులు కమల్‌కిశోర్, డాక్టర్ శంకర్‌లాల్ లాహోటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడిగా శ్యాంసుందర్ ఎన్నికయ్యారు.